బతుకమ్మ ఘాట్‌ను అభివృద్ధి చేయాలి

గాజులరామారం, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్ బతుకమ్మబండలోని బతుకమ్మ ఘాట్‌ను సుందరీకరించాలని కాలనీ అధ్యక్షుడు చెట్ల వెంకటేష్ గాజులరామారం సర్కిల్ డీసీ మల్లారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సోమవారం అందజేశారు. బతుకమ్మ ఘాట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే మట్టిని నింపుతున్నారని, ఘాట్‌ను ఎక్స్‌టెన్షన్ చేసి, సీసీ రోడ్లు, రూమ్‌లను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ శివప్ప తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా చర్యలు తీసుకోవాలి

బాలానగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో బాలానగర్‌లోని లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా తగు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆయన జడ్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. భారీ వర్షాలు కురిస్తే చరబండరాజుకాలనీ, కల్యాణ్‌నగర్, నవజీవన్‌నగర్, సాయినగర్ బస్తీలోకి నాలా వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉందని ఆయన జడ్సీకి అందజేసిన వినతిపత్రంలో వివరించారు. సీపీఎం కమిటీ సభ్యులు పి.శంకర్, ఏ.విజయ, దామోదర్, రాజు, మల్లయ్య పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఫతేనగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ శివాలయం రోడ్డులో ఉన్న భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ మాస చివరి సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ పూజల్లో కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పలపు బాలనర్సింహ్మారావు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండి రమేష్‌కు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వరాల స్వామి, గుండాల జ్యోతి, మాధురి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఆందోళన చేస్తున్న కృషి కాలనీవాసులు

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని అవినీతి అధికారులు, రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నా పట్టించుకోని టీపీఎస్ ప్రభావతిపై చర్యలు తీసుకోవాలని కృషికాలనీ వాసులు భాస్కర్‌రెడ్డి, సంజీవ్, మజీద్‌పాషాలు ప్రజావాణిలో సర్కిల్ ఉపకమిషనర్ నర్సింహకు సోమవారం వినతిపత్రం అందశారు. అనంతరం అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గణేశ్ బ్రదర్స్ బట్టల షాప్ యజమాని విద్యుత్ స్తంభం తొలగించి రోడ్డు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని అధికారులు పట్టించుకోవడం లేదని కమిషనర్‌కు తెలిపారు. దీంతో ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, నిర్మాణాన్ని కూల్చివేస్తామని హామీ ఇచ్చారు. సూరారం లింగంచెరువును కాపాడాలని, తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించి గాజులరామారం డీసీ తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

'లారీలను కేటాయించిన స్థలంలోనే నిలపాలి'

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): లారీలు, ట్రక్కులు వాటికి కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఎస్ఆర్‌నాయక్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియాకు సంబంధించిన ట్రక్కులను, లారీలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరగడంతో పాటు ట్రాఫిక్ జామ్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆ ప్రాంత వాసులు సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రహదారులపై వాహనాలు నిలిపి ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు జి.లక్ష్మీనారాయణ, పివి.భాస్కర్ రెడ్డి, పూర్ణచంద్రగుప్తా, హరిబాబుయాదవ్, దుర్గారావు, అనిల్‌కుమార్, సీతారామ రాజు, కెవి రాజు, అలీ, రాజు, వెంకటేశ్వర్లు ఉన్నారు.



బాధిత కుటుంబసభ్యులకు ఎల్ఓసీపత్రం అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

సీఎం సహాయ నిధితో పేదలకు ఎంతో మేలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌కు చెందిన నాగరాజు తలకు గాయం కావడంతో కొన్ని రోజులుగా ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి దృష్టికి స్థానిక నాయకుడు తీసుకవెళ్లగా సీఎం సహాయ నిధి నుంచి రూ. 2 లక్షలా 50 వేల విలువ చేసే ఎల్ఓసీ పత్రాలను బాధిత కుటుంబసభ్యులకు ఆయన సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివకుమార్, సోమన్న, శ్రీధర్‌రెడ్డి, హరికిరణ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌కు క్రీడా పురస్కారం



అవార్డు అందుకుంటున్న జగన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుకు స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రదానం చేసింది. న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాదికి గాను ఉత్తమ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్‌గా జగన్‌కు పురస్కారం ప్రదానం చేశారు. హ్యాండ్ బాల్, క్రికెట్‌తో పాటు పలువురు క్రీడాకారులకు వ్యక్తిగతంగా జగన్ అందిస్తున్న ప్రోత్సాహం, క్రీడారంగం అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి గాను ఈ అవార్డును ప్రదానం చేశారు.



చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న జనసేన నాయకుడు మోహన్‌కుమార్

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు కూకట్‌పల్లి జనసేన నాయకుడు తుమ్మల మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో ద్వారకామయి సేవా సమితి అనాథాశ్రమంలో పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు, దాక్షాయిని, శిరీష, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్: సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



ఓల్డుబోయినపల్లి శాంతినికేతన్ కాలనీ బస్తీ దవాఖానాను సందర్శించిన ఎమ్మెల్యే కృష్ణారావుతో కార్పొరేటర్ నర్సింహయాదవ్



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

ముంపు ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు

● విరిగిన చెట్ల తొలగింపు ● విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ ● ముంపు బాధిత ప్రజలకు నేతల పరామర్శ

మూడు రోజులుగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం వర్షం తీవ్రత కొంత తగ్గడంతో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు ఆయా లోతట్టు ప్రాంతాలలో పర్యటించి బాధిత ప్రజలను పరామర్శించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది రోడ్లపై చెత్తాచెదారాన్ని తొలగించారు. వర్షాలకు పలు కాలనీలు ఇంకా జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. రోడ్లపై వరదనీరు పూర్తిగా వెళ్లడం లేదు. పలు చోట్ల రోడ్లు గుంతలమయంగా మారాయి.



కేపీహెచ్‌బీకాలనీ:హబీబ్‌నగర్‌లో బాధితులకు ఆహారం అందిస్తున్న మోయిజ్ తదితరులు



పీఎన్ఆర్ కాలేజీ వద్ద గుంతల మయంగా రోడ్డు, వాహనదారుల ఇబ్బందులు



దూలపల్లి సాయిబాబా ఆలయ సమీప రహదారిలో నిలిచిపోయిన వరదనీరు, మురుగునీరు

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నాగేందర్‌యాదవ్, మంజులరెడ్డితో కలిసి మియాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌ని నాయనమ్మకుంట చెరువు ఔట్‌లెట్, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరదముంపు, చందానగర్ కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్ ప్రాంతాలను పరిశీలించారు.

● హైదర్‌నగర్ డివిజన్ ప్రగతినగర్ అంబీర్ చెరువు ఔట్‌లెట్‌ను కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు.

● కూకట్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ బాబురావు పరిశీలించారు.

● వర్షాలకు మూసాపేట్‌లో నేలకొరిగిన చెట్లను తొలగించాలని కార్పొరేటర్ మహేందర్ అధికారులకు తెలిపారు.

● దుండిగల్ గ్రామంలోని 3వ వార్డులో ఇద్దరు కూతుళ్లతో కలిసి నివాసం ఉంటున్న తంబారి బాలమణి ఇల్లు భారీ వర్షానికి కూలిపోయింది. దీంతో ఆమెతో పాటు ఇద్దరు కూతుర్లు రోడ్డున పడ్డారు.

● సర్కిల్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉపకమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు లక్ష్మీగణేష్, కిష్టప్పలతో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు విద్యుత్, నీరు ఇతర సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిపోయిన ఇంట్లో ఇద్దరు పిల్లలతో బాలమణి

దుండిగల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ గ్రామం 3వ వార్డులో తంబారి బాలమణి తన ఇద్దరి కూతుర్లతో తనకున్న పురాతన ఇంట్లో నివాసం ఉంటోంది. భర్త చనిపోవడంతో కూలి పనులు చేస్తోంది. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆమె ఉంటున్న ఇల్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో ఆమెతో పాటు ఇద్దరు కూతుర్లు రోడ్డున పడ్డారు. అధికారులు తమను ఆదుకోవాలని బాలామణి కోరుతుంది.



మూసాపేట్‌లో చెట్ల కొమ్మల తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ మహేందర్



కేపీహెచ్‌బీ ట్రినిటీ చర్చి వద్ద ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



బాచుపల్లి రోడ్డులో నిలిచిన నీరు



నిజాంపేట్:ప్రగతినగర్ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



పైప్‌లైన్ రోడ్డులో రహదారిపై పారుతున్న మురుగు నీరు

నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్న ఎక్స్‌ట్రీమ్ మార్ట్‌పై కేసు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ పేరుతో నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్న ఎక్స్‌ట్రీమ్ మార్ట్‌పై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్‌లోని లక్ష్మీ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో ఎక్స్‌ట్రీమ్ పేరుతో లోకల్‌గా ఉత్పత్తి అయ్యే సన్‌గ్లాసెస్, దుస్తులు, షూలకు రేబాన్, ప్రాడా, నైక్, పోలో స్టిక్కర్లు అంటించి విక్రయిస్తున్నట్లు ఆయా కంపెనీల రిప్రజెంటివ్ రాజు మేథారి సోమవారం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్టిక్కర్లు వేసిన ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు

వర్సిటీ నిధులు సొంత ఖాతాలోకి మళ్లింపు ఉద్యోగిపై పోలీసులకు ఫిర్యాదు

రాయదుర్గం, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ నిధులను ఫోర్జరీ సంతకంతో తన ఖాతాలోకి మార్చుకున్న కాంట్రాక్టర్ ఉద్యోగిపై రాయదుర్గం పోలీసులకు వర్సిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా వెలుగోడే ప్రాంతానికి చెందిన జాకీర్‌హుస్సేన్ షేక్ ఏడాది క్రితం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దు యూనివర్సిటీలోని ఫైనాన్స్ విభాగంలో కాంట్రాక్టర్ ఉద్యోగిగా చేరాడు. నాటి నుంచి పలు అక్రమాలకు పాల్పడుతుండటంతో వర్సిటీ అధికారులు కొంతకాలం క్రితం అతనిని విధులు నుంచి తొలగించారు. కాగా వర్సిటీ ఇంటర్నల్ అడిట్‌లో జాకీర్‌హుస్సేన్ ఫైనాన్స్ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి తన వ్యక్తిగత ఐదు ఖాతాలకు రూ.52 లక్షల నిధులను దారిమళ్లించినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. దీంతో ఆగస్టు 27న వర్సిటీ అధికారులు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిపోర్టర్‌పై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

మియాపూర్: విధి నిర్వహణలో ఉన్న ఓ పత్రికకు సంబంధించిన రిపోర్టర్ తనపై దాడి జరిగిందని మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రిపోర్టర్ భూమేష్ విధి నిర్వహణలో భాగంగా మియాపూర్ ఈర్లచెరువుకు సంబంధించిన ఫొటోలు తీయడానికి వెళ్లితే తనపై దాడిచేసి, సెల్‌ఫోన్‌లో ఫోటోలు డిలిట్ చేశారని, వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు విలేకరిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అద్దె బకాయి ఇవ్వలేదని దాడి

చిక్కడపల్లి: అద్దె ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేసిన వ్యక్తిని యజమానులు చితకబాదారు. చిక్కడపల్లి ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి సాయిబాబా గుడి వద్ద నరేష్, చోటు సోదరుల ఇంట్లో మహ్మద్ రఫీక్ (33) అద్దెకు ఉంటున్నాడు. యజమానుల సూచన మేరకు ఇంటిని ఆదివారం ఖాళీ చేశాడు. అద్దె రూ. 2 వేలు బకాయి ఉన్నాడు. అద్దె బకాయి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆదివారం రాత్రి మూన్ కేఫ్ వద్ద టీకొట్టు నడుపుతున్న రఫీక్‌ను చితకబాదారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. చోటు పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ఆర్‌కు ఘనంగా నివాళి



కొంపల్లి మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ సుదర్శన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు అశోక్‌రెడ్డి

ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో వద్ద ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు నివాళులర్పించారు



షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో నివాళులర్పిస్తున్న బండి రమేష్, శేరి సతీష్‌రెడ్డి తదితరులు



బాలానగర్ పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండిరమేష్‌తో కార్యకర్తలు

16 ద్విచక్రవాహనాలు చోరీ

● రూ.15 లక్షలు విలువచేసే బైక్‌లు మాయం
● నిందితుల అరెస్ట్

మియాపూర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న ఘరానా ముఠాను మియాపూర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.15 లక్షలు విలువ చేసే 16 ద్విచక్రవాహనాలు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పార్కింగ్‌చేసిన ద్విచక్రవానాలను దొంగతనాలకు పాల్పడిన ముఠాను పథకం ప్రకారం అరెస్టు చేసినట్లు తెలిపారు. మియాపూర్ హఫీజ్‌పేటకు చెందిన ప్రధాన నిందితుడు షేక్ అబుద్‌అలీపై సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలో 18 కేసులు ఉన్నట్లు తెలిపారు. ప్రధాన నిందిడుతు ఎలక్ట్రిషిన్‌గా పనిచేస్తుండగా ఇదే ప్రాంతానికి చెందిన సేల్స్‌బాయ్‌గా పని చేస్తున్న అబ్దుల్ రియాజ్, హఫీజ్‌పేట ప్రేంనగర్‌కు చెందిన మహేష్, జోషవ, సల్లావుద్దీన్‌అలి వీరు జల్సాలకు అలవాటుపడి మాదాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, గోపాలపురం ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన నిందితుడు షేక్ అబుద్‌అలీ ప్రధాన పాతనేరస్తుడు కావడంతో అరెస్టు చేసి విచారించడంతో చేసిన చోరీల గురించి వెల్లడించాడు. ముఖ్యంగా మెట్రోస్టేషన్, మాల్స్, హోటల్స్ వద్ద పార్కు చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేసి అమ్ముకుని జల్సాలు చేసుకునే వారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

మండపాలకు తరలేందుకు సిద్ధంగా గణనాథులు

బాలానగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): చవితి వేడుకలకు వినాయక విగ్రహాలు సిద్ధమయ్యాయి. వేడుకలు ఇంకా ఐదు రోజులు మాత్రమే ఉండడంతో శివారు ప్రాంతాలైన మియాపూర్, పటాన్‌చెరు, కూకట్‌పల్లి, కొంపల్లి, ఓల్డుబోయినపల్లి తదితర ప్రాంతాలలో రాజస్థానీ కళాకారులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతూ విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలనే వాడాలని పర్యావరణ ప్రేమికులు, జీహెచ్ఎంసీ అధికారులు సూచనలు చేస్తున్నప్పటికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో వివిధ ఆకృతులతో తయారు చేసిన ప్రతిమలపై మక్కువ తగ్గలేదని అమ్మకాలను బట్టి తెలుస్తోందని విగ్రహాల తయారీదారులు చెబుతున్నారు. సైజుల వారిగా విగ్రహాల రేట్లు ఉంటాయని ఒక్క అడుగు నుంచి 3, 5 అడుగుల విగ్రహాలు రూ.3 నుంచి 7 వేల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలియజేస్తున్నారు. గత మూడు రోజులుగా భారీ వర్షాల కారణంగా విగ్రహాల అమ్మకాలు మందగించాయని, వర్షం తగ్గితే అమ్మకాలు పెరుగుతాయని తయారీదారులు తెలిపారు.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గణేశ్ విగ్రహాలు

ఎస్సీ బస్తీవాసులను కాపాడుకుంటా: ఎమ్మెల్యే కృష్ణారావు

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఇళ్లు ఖాళీ చేయాలని, లేకుంటే కూల్చివేస్తామని ఎస్సీ కాలనీవాసులకు బాలానగర్ మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేసినంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓల్డుబోయినపల్లి ఎస్సీ బస్తీవాసులకు భరోసా ఇచ్చారు. సోమవారం ఉదయం కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్, డివిజన్ నాయకులతో కలిసి బస్తీలో పర్యటించారు. బస్తీకి ఎమ్మెల్యే కృష్ణారావు వస్తున్నాడనే సమాచారం తెలుసుకున్న బస్తీ మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అధికారులు తమకు జారీ చేసిన నోటీసులను ఎమ్మెల్యేకు చూపించేందుకు ఎగబడ్డారు. నోటీసులను పరిశీలించిన ఎమ్మెల్యే బస్తీవాసులను ద్దేశించి మాట్లాడుతూ 70 ఏళ్లుగా నివాసముంటున్న బస్తీని కూల్చివేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. చెరువును ఆక్రమించిన జయలక్ష్మి గార్డెన్ లాంటి బడాబాబులను వదిలి పేదల గుడిసెలకు అధికారులు నోటీసులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్, చెరువుకు సమీపంలోని బఫర్ జోన్‌లోని అపార్టుమెంట్లను అధికారులు ఎందుకు కూల్చడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓల్డుబోయినపల్లి ఎస్సీబస్తీతో పాటు నియోజకవర్గంలో ఉన్న బస్తీలేవీ కూల్చివేతలకు గురికాకుండా ఉండేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు బస్తీవాసులకు వివరించారు. ఇళ్లను కూల్చివేస్తామని అధికారులెవరైనా వస్తే ప్రాణాలొడ్డైన పేద ప్రజల ఇళ్లను కాపాడతానని ఎమ్మెల్యే బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్, నాయకులు కర్రె జంగయ్య, మక్కుల నర్సింగ్, నరేందర్‌గౌడ్, సయ్యద్ ఎజాజ్, యాదగిరి, గడ్డం నర్సింహ్మా, డివిజన్ నాయకులు ఉన్నారు.